క్లుప్తంగా

పూర్తికాని రోడ్డు నిర్మాణ పనులు



ఏటూరునాగారం: చిన్నబోయినపల్లి నుంచి కొండాయి వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులు అసంపూర్తిగా చేశారని దీంతో ఇబ్బందులు పడుతున్నామని కొండాయి, మల్యాల గ్రామాల ప్రజలు, సర్పంచ్ కాక వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో వారు మాట్లాడారు. చిన్నబోయినపల్లి నుంచి కొండాయి వరకు ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా రూ.15 కోట్లు ప్రభుత్వం మంజూరు చేయగా కాంట్రాక్టర్ పనులు దక్కించుకుని రెండు సంవత్సరాల నుంచి పనులు సరిగా చేయకుండా ఎక్కడి పనులు అక్కడే నిలిపివేశారని తెలిపారు. కల్వర్టుల కోసం రోడ్డు మొత్తం తవ్వి నిర్లక్ష్యంగా వదిలేయడంతో వర్షం పడడం వల్ల మొత్తం కురుకుపోతుందన్నారు. డైవర్షన్ రోడ్లు సైతం వర్షాలకు తెగే విధంగా ఉన్నాయి. అవితెగితే షాపెల్లి, దొడ్ల, మల్యాల, కొండాయి, ఐలాపురం గ్రామాలకు రవాణా పూర్తిగా స్తంభిస్తుందని వాపోయారు. గిరిజన గ్రామాలపై రోడ్లపై అధికారులు, కాంట్రాక్టర్ కనికరం చూపడం లేదని ఆవేదనవ్యక్తం చేశారు. కలెక్టర్, ఐటీడీఏ పీఓ స్పందించి రోడ్డు పనులు పూర్తి అయ్యే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అన్వర్, పాయం బాబు, నాగరాజు, గోవర్ధన్, నాగయ్య, కమలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రశంస పత్రం అందజేత



వాజేడు: వాజేడుకు చెందిన ఆక్వా రైతు దత్తుడు బాబు జిల్లా ఉత్తమ రైతుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నాడు. నేషనల్ ఫిష్ ఫార్మర్స్ డే సందర్భంగా హైదరాబాద్‌లోని హరిత బ్లాగ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో మత్స్య శాఖ కమిషనర్ బొక్కా నాయక్, ఎమ్మెల్సీ రాజేందర్ చైర్మన్ బండ్ల ప్రకాశ్ చేతుల మీదుగా ఈ ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. చేపలు, రొయ్యల పెంపకంలో వశిష్ట ఆక్వా వారు జిల్లాలో ఉత్తమంగా నిలిచినందుకు గాను సన్మానం చేసి ప్రశంస పత్రం అందించినట్లు బాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పలువురుకి గాయాలు



వాజేడు: రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని చెరుకూరు, ధర్మవరం గ్రామాల మధ్యన సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏటూరునాగారం మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన కాగా పాషా, పేరూరుకు చెందిన సతీష్, ధర్మరాజు శ్రీనివాసరావు రెండు ద్విచక్రవాహనాలపై ఎదురెదురుగా వచ్చి చెరుకూరు, ధర్మవరం గ్రామాల మధ్య ఢీ కొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న ఎస్సై రుద్రారపు హరీష్ సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారికి చికిత్స నిమిత్తం ఏటూరునాగారం సివిల్ ఆస్పత్రి తరలించారు.

అసంపూర్తిగా గుంతల పూడ్చివేత



అసంపూర్తిగా పూడ్చిన జియో కేబుల్ కందకాలు



రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ఉన్న కందకాలు

- అస్తవ్యస్తంగా రోడ్డు సైడ్ బర్మ్
- ప్రమాదకరంగా జియో కేబుల్ కందకాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ఎస్ఎస్ తాడ్వాయి: మండల కేంద్రంలోని జాతీయ రహదారి సైడ్‌బర్మ్ గుంతలతో అస్తవ్యస్తంగా దర్శనమిస్తుంది. జియో కేబుల్ ఏర్పాటు కోసం రోడ్డుకు ఇరువైపులా కందకాలు తవ్వి కేబుల్ అమర్చిన అనంతరం పూడ్చివేత చేపడుతున్నారు. మండల కేంద్రంలోని సమ్మక్క ఆర్చి నుంచి సింగిల్ విండో కార్యాలయం వరకు ప్రధాన రహదారి పక్కన జియో కేబుల్ తవ్విన కందకాల పూడ్చివేత అసంపూర్తిగా కనిపిస్తుంది. కందకాలలో కేబుల్ అమర్చిన తర్వాత మట్టితో పూడ్చి చదును చేయాల్సి ఉండగా, నామమాత్రంగా పనులు సాగిస్తున్నారు. కెనరా బ్యాంకు వెళ్లే దారిలో రోడ్డు పక్కన కందకాన్ని పూడ్చకుండా వదిలేయడంతో ప్రమాదకరంగా మారింది. బ్యాంకు వద్దకు వచ్చే వినియోగదారులు వారి వాహనాలను కూడా రోడ్డు దింపి పార్కింగ్ చేసే పరిస్థితి లేకుండా పోయింది. తహసీల్దార్, పోలీస్ స్టేషన్, మండల పరిషత్ కార్యాలయం ముందు అసంపూర్తిగా గుంతలు పూడ్చకుండా ఉన్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. వాహనదారులు అదమర్చి రోడ్డు దిగితే ప్రమాదాలు జరిగే అస్కారం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి వెంటనే కందకాల పూడ్చివేత సక్రమంగా చేపట్టే విధంగా చర్య తీసుకోవాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న పోరిక గోవింద్ నాయక్

ములుగు: విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని గ్రంథాలయ సంస్థ ములుగు జిల్లా చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ సూచించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా సమగ్రశిక్ష క్వాలిటీ కంట్రోల్ కో ఆర్డినేటర్ సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన పుస్తక పఠన కార్యక్రమానికి గోవింద్‌నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో గ్రంథాలయాలను విస్తరించి పుస్తకాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని అన్నారు. విద్యార్థులతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న నిరుద్యోగులకు ఇది గొప్ప అవకాశం అని అన్నారు. ఈ సందర్భంగా గోవింద్ నాయక్‌ను విద్యాశాఖ తరుపున శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు ఆదిరెడ్డి, ప్రమీల, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల హక్కులను పరిరక్షించాలి

ఏటూరునాగారం: ఆదివాసీల హక్కులను పరిరక్షించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి జిల్లా తుడుం దెబ్బ ఇన్‌చార్జ్ ఎట్టి ప్రకాశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనులకు ఇంటి స్థలాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో తల్లడి విజయ, వాసం భవాని, సోయం రత్నం, కుడుముల సమ్మక్క, నిరోష, సోయం లక్ష్మి, వాసం ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పోడు పట్టాలివ్వాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆదివాసీలు

వెంకటాపురం(కె): అర్హులందరికీ పోడు పట్టాలివ్వాలని కోరుతూ సోమవారం ఆదివాసీ నవనిర్మాణ సేన ఆధ్వర్యంలో వాజేడు, వెంకటాపురం(కె) మండలాల ఆదివాసీలు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నవనిర్మాణ సేనవ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కొర్స నర్సింమూర్తి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత పోడు సాగుదారుల సమస్యలను పరిష్కరిస్తానని కేసీఆర్ ఇచ్చిన హామీ బూడిదలో పోసిన పన్నీరు అయిందన్నారు. పోడు సాగు దారులందరికీ పట్టాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం పరిమితిగా అక్కడక్కడ ఇచ్చి వదిలేసిందని విమర్శించారు. రెండు మండలాల్లో నాలుగు వేల మంది దరఖాస్తు చేసుకోగా కేవలం15 మందికి మాత్రమే హక్కు పత్రాలు ఇచ్చారన్నారు. అటవీ శాఖాధికారులు, ప్రభుత్వం కలిసి ఆదివాసీలకు అన్యాయం చేస్తున్నారన్నారు. పెసా చట్టం ద్వారా ఎన్నికైన ప్రజాప్రతినిధులు సాగులో ఉన్న పోడు భూముల విషయంలో చట్టాన్ని ఎందుకు విస్మరించారన్నారు. పోడు భూముల విషయంలో దరఖాస్తును చేసుకున్న ప్రతీ ఆదివాసీ రైతుకు హక్కు పత్రాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో భార్గవ్, కిరణ్, లక్ష్మయ్య, రైతులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన అవసరం



వాజేడు: వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి



ఏటూరునాగారం: దోమల మందు పిచికారీ చేయిస్తున్న డాక్టర్ చాముండేశ్వరీ



వాజేడులో..

ఏటూరునాగారం: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని ఏటూరునాగారం వెల్నెస్ సెంటర్ వైద్యాధికారిణి చాముండేశ్వరీ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని 2, 3వ వార్డులో సైడ్ కాల్వల్లో దోమల వ్యాప్తి నివారణకు పైరెథాయిడ్ ద్రావణాన్ని స్ప్రే చేయించారు. అనంతరం డాక్టర్ చాముండేశ్వరీ మాట్లాడుతూ.. వానాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం పద్మ, ఆశవర్కర్లు మాధవి, శారద, స్వరూప పాల్గొన్నారు.

సికిల్ సెల్‌పై జాగ్రత్తగా ఉండాలి

వాజేడు: సికిల్ సెల్ అన్నీమియా వ్యాధి రాకుండా జాగ్రత్తగా ఉండాలని వాజేడు వైద్యాధికారి మహేందర్ అన్నారు. జాతీయ సికిల్ సెల్ అన్నీమియా నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని మొరుమూరు కాలనీ, పెద్ద గొళ్లగూడెం గ్రామాల్లో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సికిల్ సెల్ అన్నీవియాపై అవగాహన కల్పించారు.

బంద్‌ను విజయవంతం చేయాలి



ములుగు రూరల్: మాట్లాడుతున్న సాగర్



ఏటూరునాగారం: మాట్లాడుతున్న రవి

ములుగు రూరల్: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12వ తేదీన ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బంద్‌ను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కుమ్మరి సాగర్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల నియంత్రణ చేపట్టాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యారంగ సమస్యలపై ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపడుతున్న బంద్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్, గణేష్, రాజు, రమేష్, ప్రవీణ్, నరేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏటూరునాగారంలో..

ఏటూరునాగారం: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 12 న రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి టిఎల్ రవి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగానికి సరిపడా నిధులు కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు ముక్కెర ధనుష్, బట్ట స్వామి, మండల నాయకులు సూర్య, ఉమేష్, రాజేష్ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

చిట్యాల: మద్యం తాగి వాహనాలు నడపొద్దని ఎస్సై జంగిలి రమేష్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చల్లగరిగ గ్రామ శివారులో వాహనాలను తనిఖీ చేపట్టారు. ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి వాహనం నడుపుతుండగా వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వాహనదారులు ఏలాంటి అనుమతి పత్రాలు లేకుండా రోడ్డుపై తిరుగరాదన్నారు. పత్రాలు సరిగా లేని 11 వాహనాలపై జరిమానా విధించారు. పోలీస్ సిబ్బంది లాల్‌సింగ్, నవీన్ తదితరులు ఉన్నారు.

పశువులను తరలిస్తున్న వాహనం పట్టివేత



వాహనాన్ని చూపుతున్న పోలీసులు

ఎస్ఎస్ తాడ్వాయి: పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై వెంకటేశ్వరరావు కథనం ప్రకారం.. సోమవారం మండల కేంద్రంలోని వాహనాలు తనిఖీ చేస్తుండగా వాహన డ్రైవర్ పోలీసులను చూసి అతివేగంగా, అజాగ్రత్తగా వెళ్తుండగా అనుమానంతో వెంబడించి పట్టుకొని తనిఖీ చేయగా, పశువులను అక్రమంగా తరలిస్తున్న విషయం బయటపడిందన్నారు. దీంతో వాహనంతో పాటు 94 పశువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్‌కు చెందిన డ్రైవర్ గడ్డిపావలా అర్జున్, హైదరాబాద్‌కు చెందిన డ్రైవర్ ఎండీ అంజద్‌లను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న పశువులను రాంపూర్, మేడారం రోడ్డులోని గోశాలకు పంపించినట్లు తెలిపారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనం చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

ములుగు రూరల్: అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ డిమాండ్ చేశారు. జిల్లాలోని అంగన్‌వాడీలు జంగాలపల్లి క్రాస్ నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు సోమవారం ర్యాలీ నిర్వహించి ధర్నాకు దిగారు. అనంతరం అదనపు కలెక్టర్ వైవీ.గణేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ ఆలిండియా డిమాండ్స్ డే సందర్భంగా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యూటీ అమలు చేయాలన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు గడుస్తున్నా అంగన్‌వాడీల సమస్యలను ఏ ఒక్కటి పరిష్కరించలేదన్నారు. ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలని కోరారు. అంగన్‌వాడీలకు పక్కా భవనాలను ఏర్పాటు చేయాలని, ఆరోగ్య లక్ష్మీ మెనూ చార్జీలను పెంచాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంల్లోని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావూద్, నర్సింహచారి, మహేష్, రవి, యూనియన్ అధ్యక్ష కార్యదుర్శలు సరోజన, సమ్మక్క, రుద్రమదేవి, పద్మరాణి, జమున, ప్రేమకుమారి, వెంకటరమణ, స్వరూప, విజయలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న సంస్థ సభ్యులు

వెంకటాపురం(కె): మండలంలోని మరికాల గ్రామంలో చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 15 యూనిట్ల రక్తదానం చేసి ఏటూరునాగారం సివిల్ అస్పత్రికి సంస్థ ఆధ్వర్యంలో పంపించారు. రక్తం ఇచ్చిన వారికి చేయూత స్వచ్ఛంద సంస్థ తరుపున ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వాసం సత్యవతి, బాలసాని శ్రీను, అశోక్, స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సాయి, ప్రకాష్, సాయి తేజ, రాజు, విజయ్, మురళీ కృష్ణ, సర్వేశ్వరావు ఉన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న ఎస్సై

వెంకటాపురం(ఎం): విద్యతోనే అన్ని విధాలుగా అభివృద్ధి సాధ్యమని బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పులి దేవేందర్ అన్నారు. సామాజిక కార్యకర్త సంద బాబు జ్ఞాపకార్థం బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్స్, స్టేషనరీని వెంకటాపురం ఎస్సై తాజుద్దీన్ చేతుల మీదుగా విద్యార్థులకు సోమవారం అందించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలకు కోసం ప్రతి నెల సభ్యులు తమకు తోచిన సహాయాన్ని అందిస్తున్నారన్నారు. భవిష్యత్‌లో నిరుపేద విద్యార్థుల కోసం మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం ఎస్సై తాజుద్దీన్ మాట్లాడుతూ.. సామాజిక కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా నిరుపేద విద్యార్థులకు చేయూతనిస్తున్న బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ సభ్యుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జనగాం బాబురావు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెండ్యాల సలేంద్రం, ఫౌండేషన్ సభ్యులు కాసుల రవికుమార్, పంతంగా భాస్కర్, మధు, రఘుపతి, సతీష్, రాకేష్, జనార్థనచారి. సంతోష్, స్వరూప, శ్రీధర్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఏటూరునాగారం: సమ్మెకు మద్దతు తెలుపుతున్న చైతన్య యూత్ సభ్యులు



వెంకటాపురం(కె): సమ్మె చేస్తున్న కార్మికులు



ఎస్ఎస్ తాడ్వాయిలో..

ఏటూరునాగారం: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో 12 గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె 5వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆటో యూనియన్ నాయకులు, చైతన్య యువజన సంఘం సభ్యులు, నేతకాని సంఘం నాయకులు సంఘీభావం తెలిపి మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు రఘు మాట్లాడుతూ 51 జీఓను రద్దు చేసి, సీనియార్టీ ఉన్న కారోబార్‌లను జూనియర్ పంచాయతీలుగా పరిగణించాలని, హెల్త్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు పిట్టల శ్రీను, కత్తెర శ్రీనివాస్, దీనబాంధుస్వామి, కార్తీక్, రఘు, ఇర్సవడ్ల రాజు, ఏటూరునాగారం మండలం ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు ఇరుసవడ్ల కిరణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా మైనార్టీ అధ్యక్షుడు అయూబ్, మండల మైనార్టీ అధ్యక్షుడు గౌస్, కొండాయి గ్రామ కమిటీ అధ్యక్షులు, యూత్ లీడర్ తోట ప్రశాంత్, రాంబాబు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ చేపట్టిన గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె కొనసాగుతుంది. ప్రభుత్వం తమకు 60 పద్దు ద్వారా జీతాలు ఇవ్వాలని, కారోబార్‌లను సహాయక కార్యదర్శులుగా ప్రమోషన్ కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎస్ఎస్ తాడ్వాయి: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె శిబిరాన్ని సోమవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి సందర్శించి, సంఘీభావం తెలిపారు. సమ్మక్క సారలమ్మ పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు కూడా మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బొల్లు దేవేందర్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎందుకు వెనకాడుతుందో అర్థం కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్, సర్పంచులు ఇర్ప సునీల్ దొర, రేగ కల్యాణి, మంకిడి నరసింహస్వామి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాక సాంబయ్య, సింగల్ విండో డైరెక్టర్లు యానాల సిద్దిరెడ్డి, జగదీష్ ఉన్నారు.

గుడుంబా స్వాధీనం

భూపాలపల్లి రూరల్: మండలంలోని రాంపూర్ క్రాస్ రోడ్ వద్ద సోమవారం గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు భూపాలపల్లి ఎక్సైజ్ ఎస్సై మాన్‌సింగ్ తెలిపారు. ఎక్సైజ్ ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రాంపూర్ క్రాస్ రోడ్ వద్ద రూట్ వాచ్ చేస్తుండా గొల్లబుద్దారం గ్రామానికి చెందిన వాంకుడోత్ రంజిత్ కుమార్, వాంకుడోత్ జగపతి నుంచి 10 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గొల్లబుద్దారం నుంచి కిష్టాపూర్‌కు ఒకరు, రాంపూర్ గ్రామానికి ఒకరు ద్విచక్ర వాహనాల ద్వారా గుడుంబా రవాణా చేస్తున్నారనే సమాచారం మేరకు రూట్‌వాచ్‌చేసి పట్టుకున్నట్లు తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి రెండు వాహనాలను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ హెడ్ కానిస్టేబుల్ రఘుపతి, కానిస్టేబుల్ ముజాఫర్, విష్ణువర్ధన్‌తో పాటు తదితరులు ఉన్నారు.